క్లుప్తంగా

వైభవంగా శ్రీపుష్పయాగం

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో ఆదివారం రాత్రి సీతారాములకు శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటలతో అన్నదానం ఏర్పాటు చేశారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ పాలని దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

కొత్తపల్లి: సమాజంలో ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని మత్స్యకార మహిళ మడదా రాజేశ్వరి అన్నారు. మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన మత్స్యకారుడు రామరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఆదివారం రాజేశ్వరి పరామర్శించారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాలంకరణతో సిద్ధం చేసిన రథం

గొల్లప్రోలు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చేబ్రోలులో సోమవారం సీతారాముల రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్త దామెర వెంకటదివాకర్, ఈఓ అశ్విని ఆదివారం తెలిపారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

నేడు కురసాల నామినేషన్



ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ తరఫున కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ఉదయం 10.40 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చే ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి కాకినాడ 2వ డివిజన్ రమణయ్యపేటలోని వైద్యనగర్ వద్ద క్యాంపు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా ఉదయం 9 గంటలకు కన్నబాబు బయలుదేరనున్నారు. కన్నబాబు క్యాంపు కార్యాలయం నుంచి వినాయక కేఫ్, నాగమల్లి జంక్షన్ మీదుగా స్పెన్సర్ వరకు ర్యాలీ జరగనుంది. అక్కడ నుంచి సర్పవరం జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్వో కార్యాలయం వరకు నడిచి వెళ్లనున్నారు. తమ అభిమాన నాయకుడు కన్నబాబు నామినేషన్ పర్వంలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని ప్రజలు వేలాదిగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నాడు అవస్థల మయం నేడు అభయం



నేడు: రూ.1.60 కోట్లతో నిర్మించిన ఒమ్మంగి-శరభవరం రహదారి

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మండలంలోని ఒమ్మంగి - శరభవరం రోడ్డును నిర్మించింది. రూ.1.60 కోట్లతో ఒమ్మంగి రాజ్ చెరువు నుంచి శరభవరం సమీపంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వరకూ ఆర్అండ్బీ రహదారిని పునర్నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ పట్టించుకొన్న దాఖలాలు లేవు. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. ఫలితంగా ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నరకం చూసేవారు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారికి మోక్షం కలిగింది. రహదారిని పునర్నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా మారిన ఉప్పాడ-పిఠాపురం రోడ్డు



ఉప్పాడ తీరంలో పర్యాటకులు

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- అల్లాడిపోతున్న జనం
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారులు

కొత్తపల్లి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు తారాస్థాయికి చేరుకున్నాయి. భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం కూడా ఎక్కువగా ఉంటోంది. పిఠాపురం నియోజకవర్గంలో పగటి పూట 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా శనివారం ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్రం ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. సాధారణ ఉష్ణోగ్రతలు కన్నా అదనంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్ల, రహదారులు నిర్మానుష్యంగా మారాయి.

తీరంలో సేదతీరుతున్న ప్రజలు

వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పండ్ల రసాలు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు అనేక మంది ఉప్పాడ సముద్ర తీరానికి చేరుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా అందరూ కేరింతలు కొడుతూ సాగర తీరంలో సేదతీరుతున్నారు. సూర్యప్రతాపం రోజురోజుకూ పెరగడంతో ఉపశమనం కోసం పర్యాటకులు తీర ప్రాంతానికి చేరుకుంటున్నారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతం సందర్శకులతో కళకళలాడుతోంది.



వాకతిప్పలో దుకాణాలను ఆశ్రయిస్తున్నా ప్రజలు

వడదెబ్బకు గురయ్యే ప్రమాదం

ప్రస్తుతం మండిపోతున్న ఎండల్లో తిరిగితే ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశముంది. ఎండలో ఎక్కువసేపు పని చేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వేళ్లే అవకాశం ఉంది.

వడదెబ్బకు ప్రథమ చికిత్స ఇలా...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన క్లాత్‌తో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ తాగించాలి, లేని పక్షంలో గ్లూకోజు ద్రావణం, లేదా ఓఆర్ఎస్ తాగించాలి
- వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

వేసవితో చేయకూడని పనులు

- ఎండ తీవ్రత అధికంగా ఉంటే బయటకు వెళ్లరాదు
- రోడ్లపై విక్రయించే కలుషిత ఆహారం తినరాదు
- మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు

జాగ్రత్తలు తీసుకోవాలి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు తీసుకోవాలి. ఏవైనా పనులు ఉండే తప్ప ఎండలో తీరగకూడదు. అత్యవసరమైతే ఉదయం పూటనే చేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపి ధరించాలి. రోజు కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలి. ఎండ తీవ్రత పెరిగితే చిన్నారులు, వృద్ధులు, పొలాల్లో పనులు చేసే కూలీలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. దీనిని గమనించి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి పీహెచ్‌సీ

నేడు వంగా గీత నామినేషన్

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగా గీత సోమవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. పిఠాపురంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, స్టేట్‌బ్యాంకు సెంటర్, ఉప్పాడ సెంటర్, పాదగయ సెంటర్ల మీదుగా పిఠాపురం ఎన్నికల ప్రధాన కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వివరించారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్



పార్టీ చేరిన వారికి కండువాలు చేస్తున్న సీఎం జగన్

పిఠాపురం: పిఠాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు, గొల్లప్రోలు టీడీపీ నేత లింగం అర్జున్ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వంగా గీత విజయానికి కృషి చేస్తామని చెప్పారు. పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల అదనపు పరిశీలకుడు షేక్ బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో అపారమైన సంతృప్తి

- అందుకే రెండోసారి పోటీ
- వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం: జిల్లా పరిషత్ చైర్మన్‌గా, రాజ్యసభ, లోక్‌సభ సభ్యురాలిగా, ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి అపారమైన సంతృప్తిని ఇచ్చిందని, ఆ ఆనందంతో ఇప్పుడు రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత తెలిపారు. పిఠాపురంలో ఆదివారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత 30 ఏళ్లలో ఏ నాయకుడికి లేని అవకాశం తనకు దక్కిందని, రూ.కోట్లు నిధులు తెచ్చి కాకినాడ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. ప్రజల గుండెల్లో చిర కాలం నిలిచిపోయే అభివృద్ధి పనులు చేసిన ఘనత తనకే దక్కుతుందన్నారు. కాకినాడ ఎంపీగా కాకినాడ జిల్లాలో రైల్వేల అభివృద్ధికి సుమారు రూ.300 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి, పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.22 కోట్లతో గోర్స, మాధవపురం, హంసవరం, తునిలో 4 ఆర్‌యూబీల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

నిధుల వివరాలు ఇలా..

పిఠాపురం-ఉప్పాడ సెంటర్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి రూ.150 కోట్లు, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.21 కోట్లు, తుని రైల్వే స్టేషన్లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.35 కోట్లు, మేడపాడు రైల్వే స్టేషన్లో ఫ్లాట్ ఫాం నిర్మాణానికి రూ.2.10 కోట్లు, పిఠాపురం, రావికంపాడు, గొల్లప్రోలులో షెడ్ల నిర్మాణానికి రూ.2.49 కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చేబ్రోలు-దువ్వాడ మధ్య రైల్వే ఆర్వోప్లాంట్లు నిర్మాణానికి రూ.2.32 కోట్లు, అనకాపల్లి-తుని స్టేషన్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.1.18 కోట్లు, సామర్లకోట రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.11 కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టామన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధిని చూసి..

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు ఇచ్చి సహకరించిందన్నారు. కేంద్ర సహకారంతోనే కాకినాడ జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేయగలిగామన్నారు. ఉప్పాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ, కాకినాడలో ఈఎస్ఐ ఆసుపత్రి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మదర్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు, అన్నవరం-కాకినాడ, కాకినాడ-రాజానగరం మధ్య నాలుగు లైన్ల జాతీయ రహదారుల నిర్మాణం, పోర్టుల అభివృద్ధి, నాలుగు కొత్త పోలీసు స్టేషన్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొంది అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

వంగా గీతకు బీఫాం అందజేత



బీఫాం అందుకుంటున్న వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగా గీతకు ఆదివారం నియోజకవర్గ పరిశీలకులు పిఠాపురం పార్టీ కార్యాలయంలో బీఫాం అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా ఎన్నికల పరిశీలకుడు గుబ్బల తులసీకుమార్, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గౌతు సుబ్రహ్మణ్యం (నాగు), షేక్ బాబ్జాన్ ఆమెకు బీఫాం అందజేశారు. బీఫాం తీసుకున్న ఆమె తన కార్యాలయంలో దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ ప్రజల దీవెనలతో తాను ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వులవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన



పి.వేమవరంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అమృత

- జెడ్పీటీసీ సభ్యురాలు అమృత
- పి.వేమవరంలో ఇంటింటి ప్రచారం

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే సంక్షేమం సాధ్యమని నిరూపణ అయిందని జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత అన్నారు. ఆదివారం సాయంత్రం పి.వేమవరంలో ఆమె ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌లకు మద్దతుగా ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు స్థానికుడు కావడంతో నియోజకవర్గంలోని ప్రజలు ఆయన వద్దకు వెళ్లి సమస్యలు సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే సునీల్ ఎంపీగా విజయం సాధిస్తే నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆయన 400 గ్రామాలను దత్తత తీసుకొని ప్రతి గ్రామానికి రూ.కోటి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ప్రజలకు మంచి జరగాలంటే రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎలిశెట్టి నరేష్, సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, ఎంపీటీసీ కేశవరపు వీరమణి, ఉప సర్పంచ్ అత్తిలి సుబ్బలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, దివాకర్, బాబ్జిల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని గెలిపించండి

ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు సతీమణి చంద్రకళ

పెద్దాపురం: రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా సంక్షేమం కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ కోరారు. స్థానిక మూడో వార్డులో ఆమె అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి మడికి మేరీ సోనియా, ఆ వార్డు కౌన్సిలర్ గడపా రామలక్ష్మి, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మీలో ఒక్కడిగా, స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన దవులూరి దొరబాబును ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. సీఎం జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుంచుకోవాలని, అవి కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను కూడా గెలిపించాలని ఆమె కోరారు. తాడి రాజశేఖర్, కౌన్సిలర్లు విడదాసరి రాజా, గడపా శివ, టౌన్ అధ్యక్షులు కాపగంటి కామేశ్వరరావు అభిమానులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో తన భర్త దొరబాబుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చంద్రకళ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



జెడ్.రాగంపేటలో స్థానికులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

గండేపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహ ప్రతిష్ఠ



వినాయక స్వామిని దర్శించుకున్న దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: మండల పరిధిలో పవర గ్రామంలో ఆదివారం వినాయక విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామిని దర్శించుకోగా పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఆయనకు సర్పంచ్ వీరంరెడ్డి సీతామహా లక్ష్మి, గ్రామ పార్టీ నాయకులు వీరంరెడ్డి ఆనంద్, నాగనబోయిన రాజబాబు, ఎంపీపటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు స్వాగతం పలికారు. టీటీడీ నిధులతో చేపట్టిన ఆలయ నిర్మాణానికి దవులూరి శంకుస్థాపన చేయగా, దాతల సహకారంతో నిర్మాణాన్ని పూర్తి చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. దొరబాబు వెంట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని బైక్ యాత్ర



మోటారు సైకిల్ యాత్ర చేస్తున్న సన్యాసిరావును అభినందిస్తున్న మంత్రి రాజా

తుని: సంక్షేమ ప్రదాత, జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలుకు చెందిన గొర్లి సన్యాసిరావు మోటారు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మోటార్ సైకిల్ యాత్ర చేస్తున్న సన్యాసిరావు తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయానికి ఆదివారం చేరుకుని మంత్రి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ 40 రోజులుగా యాత్ర చేస్తున్నట్టు సన్యాసిరావు తెలిపారు. ఇందుకు రూ.4.50 లక్షలతో బైక్ కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు.

రుణ వసూళ్లకు రైతులపై ఒత్తిడి తేవొద్దు

బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

ప్రత్తిపాడు: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించమంటూ రైతాంగాన్ని ఒత్తిడికి గురిచేయవద్దని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీకాంత్ కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రైతులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే బకాయిలు చెల్లించని రైతుల అస్తులను వేలం వేస్తామంటూ బ్యాంకు అధికారులు హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితి ఎదురైతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే రైతు పంట పండించేదెలా ? అని ప్రశ్నించారు. కొంత మంది ఐపీ పెట్టడం వల్ల ప్రైవేటు అప్పులు పుట్టక, బంధువులు, తెలిసిన వారి వద్ద నుంచి తెచ్చిన విలువైన వస్తువులు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి సాగు చేస్తే గత డిసెంబర్ నెలలో వచ్చిన తుపాన్‌కు రైతులు పంట నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో పంటలోనైనా ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయని రైతాంగం ఎదురుచూస్తోందన్నారు. పంట చేతికి రాకుండానే బకాయిలు చెల్లించమంటూ బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడం దారుణమని వాపోయారు. పంట చేతికి అందేవరకూ బకాయిల చెల్లింపునకు గడువు ఇవ్వాలంటూ బీకేఎస్ జిల్లా కార్యదర్శి కె శ్రీకాంత్ కోరారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బీకేఎస్ ప్రతినిధులు ప్రసంగించారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీకేఎస్ ప్రతినిధులు భేరి రాము, ఎ.సురేఖ, శింగిలిదేవి సత్తిరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మామ కోసం అల్లుళ్ల ప్రచారం



ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన అల్లుళ్లు డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి

కాకినాడ: వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇప్పటికే ఇంటింట ప్రచారానికి శ్రీకారానికి శ్రీకారం చుట్టగా, ఆయన సతీమణి మహాలక్ష్మి కూడా ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. ఇక రెండురోజులుగా ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని కూడా తండ్రికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఆదివారం ద్వారంపూడి అల్లుళ్లు డాక్టర్ ఉదయ్‌శేఖర్ రెడ్డి, డాక్టర్ హర్షవర్ధనరెడ్డి 41వ డివిజన్‌లో చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో అడుగుపెట్టారు. మాజీ కార్పొరేటర్లు గోడి సత్యవతి, జేడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉదయ్, డాక్టర్ హర్ష ఓటర్లను స్వయంగా కలసి మంచిచేసే ప్రభుత్వాన్ని, అందుబాటులో ఉండే ఎమ్మెల్యే ద్వారంపూడిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై చిత్త శుద్ధితో పనిచేస్తూ, నిత్యం ప్రజల మధ్య ఉండే ద్వారంపూడిని మళ్లీ ఆశీర్వదిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుదంటూ ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోడి వెంకట్, దండుమహంతి లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం తదితరులు వీరివెంట ఉన్నారు.

రేపు జగ్గంపేటలో 'తోట' నామినేషన్

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట నరసింహం మంగళవారం జగ్గంపేటలో నామినేషన్ వేస్తారని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో నామినేషన్ వేస్తారన్నారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.